క్లుప్తంగా

ఏరియా మనుగడకు చర్యలు చేపట్టాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా మనుగడకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కొత్త గనుల, గనుల విస్తరణ అనుమతులు సాధించాలని కోరుతూ శుక్రవారం ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాజర్‌పాషా హైదరాబాద్‌లో ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితి కొనసాగితే మరో మూడేళ్లకు మించి మణుగూరు మనుగడ ఉండదని పేర్కొన్నారు. కొత్తగనులకు అనుమతులు రాకపోయినా గనుల విస్తరణ నిలిచిపోయినా మణుగూరు ఏరియా భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుందని ఆయన మంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబుకు నాజర్ పాషా కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపాలిటీలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ సునీల్ మున్సిపాలిటి అధికారులకు, సిబ్బందికి, కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. షుగర్, బీపీ బాధితులను పరీక్షించి మందులు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ ప్రసాద్, డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. జీవనశైలీని, ఆహారపు అలవాట్లను మార్చుకుంటూ వ్యాయామం, యోగా, ధాన్యం వంటివి ఆచరిస్తే ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం



నూతన ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న వేద పండితులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం సీతారామనగర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామివారి నూతన దేవాలయంతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వర సాయి సేవాసమితి ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠతోపాటుఆలయ ప్రారంభోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు మంత్రోశ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా భక్తులకు అన్నప్రసాదం అందజేస్తూ.. ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

దమ్మపేట: దమ్మపేట గ్రామంలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కొలువైయున్న వెంకయ్య స్వామి ఆలయ 13వ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని, స్వామిని పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో వేకువజాము నుంచే స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి, స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ములకలపల్లి: మండలపరిధిలోని తిమ్మంపేట కోదండ రామాలయ 19వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణ మహోత్సవాలు, పూజాధికాలు చేశారు. భారీగా భక్తులు హాజరుకాగా, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు తాండ్ర ప్రభాకర్‌రావు, కర్నాటి కాంతారావు, తాండ్ర శ్రీనివాసరావు, మంతపురి సత్యనారాయణ, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక అమలయ్యేనా?

వంద రోజుల్లో 50 అంశాల విజయవంతమే టార్గెట్

- నిండా సమస్యలతో అశ్వారావుపేట మున్సిపాలిటీ
- ప్రశ్నార్థకంగా లక్ష్యసాధన



అయ్యర్ బిల్డింగ్ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



గాంధీ బొమ్మ వద్ద బహిరంగంగా తగలబెడుతున్న చెత్త



100 రోజుల కార్యాచరణ ప్రణాళిక

అశ్వారావుపేట: తెలంగాణలోని మున్సిపాలిటీల్లో 2047కల్లా ఆరోగ్యకర వాతావరణం కల్పించడంతో కోసం ద రైజింగ్ తెలంగాణ 2047 అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. కాని నూతనంగా ఏర్పాటైన అశ్వారావుపేట మున్సిపాలిటీలో మురికి వాసన తప్ప మున్సిపాలిటీ వాసన కానరావడం లేదు. మరోవైపు ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల్లో ప్రజలు, అధికారులు, స్థానిక సంస్థల సహకారం, భాగస్వామ్యంతో 50 రకాల కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉంది. కానీ కమిషనర్ కార్యాలయానికి రారు. టీపీఓ వచ్చినా ఉండరు. ఏఈఈ ఎక్కడుంటారో తెలియదు. పాత పంచాయతీల సిబ్బంది మాత్రమే కార్యాలయంలో దర్శనమిస్తారు. ఈ నేపథ్యంలో మరి 100 రోజుల్లో 50 అంశాలను విజయవంతం చేయడం ప్రశ్నార్థకంగా మారింది.

జూన్ 2న ప్రదర్శన వంద రోజులు టార్గెట్‌గా 50 అంశాలను మున్సిపాలిటీల్లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు ప్రతి రోజూ 'ఒక చర్య–ఒక మార్పు'పేరిట ప్రజలను భాగస్వామ్యం చేస్తూ 'ప్రజలే ముందు'అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి.

100 రోజుల్లో చేపట్టాల్సిన పనులు ఇవే..

- మురుగునీటి కాలువలు, నాలాల్లో పూడిక వంటి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. దోమల నివారణ, తడి, పొడి చెత్త ప్రాసెసింగ్ వంటి అంశాలూ ఇందులో అంతర్భాగం. ఇది నిరంతర ప్రక్రియ.
- పరిశుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం వంటి అంశాలపై మైక్ ద్వారా ప్రచారం చేయాలి. సోషల్ మీడియా ద్వారా, ఇంటింటికి వెళ్లడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి. కాలర్ ట్యూన్లు, పెయింటింగ్ ద్వారాను ప్రజల్లో చైతన్యం నింపాల్సి ఉంది.
- పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు మార్కెట్ విక్రేతలు, దుకాణదారులు, పాఠశాలల వంటి వారి నుంచి అభిప్రాయాలను సేకరించి అందరినీ భాగస్వాములను చేయాలి.
- గ్రీన్ ప్రొటోకాల్‌ను అమలు చేయడానికి బర్తన్ బ్యాంకులు ఏర్పాటు చేయాలి.
- తడి, పొడి చెత్తలను ఇంటి వద్దనే వేరు చేడి కంపోస్టును తయారు చేయడం నేర్పించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి.
- వెండింగ్ జోన్లను సమీక్షించి గ్రేడ్ చేయాలి.
- వీధి కుక్కల సంతాన నియంత్రణ, ఇంకుడు గుంతల ఏర్పాటు తదితర అంశానలు పరిగణించాల్సి ఉంటుంది.
- టాక్స్‌కు సంబంధించి భువన్ సర్వే చేపట్టాలి.
- వనమహోత్సవం, ఎవెన్యూ ప్లాంటేషన్, పార్క్ ప్రారంభం వంటి గ్రీనరీ ఏర్పాట్లు చేయాలి.
- స్వచ్ఛభారత్ ఐఈసీ క్యాంపులు నిర్వహణ, అమృత్ రీఫార్మ్స్, ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తుల ప్రదర్శన వంటి చర్యలను మున్సిపాలిటీ చేపట్టాల్సి ఉంది.

అందరి భాగస్వామ్యంతో..

పేర్కొన్న అంశాల్లోన్ని అన్ని కార్యక్రమాల్లో స్థానికులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, ఎన్‌జీఓలు, పారిశుద్ధ్య కార్మికులు, కాంట్రాక్టర్లు, అధికారులు, వైద్యులను సమీకరించుకుంటూ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాల్సి ఉంది. ఆరోగ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. ఇందు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుని కార్యాచరణ రూపొందించాలి.

పేటలో ఎక్కడి సమస్యలు అక్కడే..

వంద రోజుల ప్రణాళిక ఇలా బారెడంత ఉన్నప్పటికీ అశ్వారావుపేట మున్సిపాలిటీలో దీనిపై సిబ్బందికే కనీస అవగాహన లేనట్లుగా మాట దాటవేస్తున్నారు. ఆరంభ శూరత్వంగా జూన్ 2న ప్రదర్శన చేసినప్పటికీ అది ఆనాటి ఫ్లెక్సీకి పరిమితం చేశారు. మళ్లీ ఆదిశగా అడుగులే వేసినట్లులేరు. ఇప్పటికే మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దుర్గంధ భరితంగా తయారైంది. మురుగునీరు తిష్ట వేసింది. తాగునీటికి కటకటగా మారిది. జనం నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రణాళికలు ఏ మేరకు అమలు చేస్తారో వేచిచూడాలి.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించండి



చంద్రుగొండ: సదస్సులో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ

చంద్రుగొండ: పంటల సేద్యంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, తద్వారా భూసారం పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ సూచించారు. మండలంలోని పోకలగూడెం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సదస్సు నిర్వహించారు. అధిక రసాయనిక ఎరువుల వాడకం ద్వారా భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రతి ఏడాది పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మునగ, పామాయిల్, వెదురు సేద్యం వైపు రైతులు దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శివ మాట్లాడుతూ.. ఉద్యాన పంటల్లో పంటలను ఆశించే చీడపీడలపై నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్, ఏఈఓ భాను పాల్గొన్నారు.

మునగ పంట సాగుపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: ప్రతి రైతూ మునగ పంటను సాగు చేయాలని, పంట సాగు చేయడం ద్వారా అధిక లాభాలు వస్తాయని కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ పి.శ్రీల, డాక్టర్ స్రవంతి అన్నారు. శుక్రవారం మండలంలోని కేశప్పగూడెం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునగ పంటకు రావాల్సిన మొక్కలను ఉద్యాన, ఉపాధి హామీ ద్వారా అందిస్తారని, ఈ పంటకు మార్కెట్ అధిక డిమాండ్ ఉందన్నారు. ఆ తర్వాత మునగ సాగు పద్ధతులు, జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ శివ రామ ప్రసాద్, ఏఈఓ సతీష్, కార్యదర్శి సమయ్య, ఉపాధ్యాయుడు రాము, రైతులు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్ బెల్టులు పంపిణీ



గేదెలకు రేడియం స్టిక్కర్ బెల్టులు తగిలిస్తున్న సీఈ బిచ్చన్న, తదితరులు

మణుగూరురూరల్: పాడి గేదెల మృత్యువాత పడడాన్ని అరికట్టేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ సామాజిక సేవా సమితి ఆధ్వర్యంలో రేడియం స్టిక్కరింగ్ బెల్టులను పంపిణీ చేశారు. బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న చేతుల మీదుగా శుక్రవారం చిక్కుడుగుంట, దమ్మక్కపేట, సాంబాయిగూడెం గ్రామాల పాడి రైతులకు ఈ బెల్టులను అందించారు.

అనంతరం సీఈ బిచ్చన్న మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు, ఇసుక, ఇతర భారీ వాహనాల వల్ల పాడి గేదెలు మృత్యువాత పడకుండా రేడియం స్టిక్కర్ బెల్టులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బీటీపీఎస్ అధికారులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

చంద్రుగొండ: జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలకేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని గీతిక ఎంపికైంది. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన గీతికను ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎం వాజీద్ శుక్రవారం అభినందించారు. ఏడాదికి రూ. 12 వేలు చొప్పున నాలుగేళ్లపాటు బాలికకు స్కాలర్‌షిప్ వస్తుందని ఎంఈఓ తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బ్రహ్మయ్య

అశ్వాపురం: హైదరాబాద్‌లో సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో కలిసి డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా, పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించారు.

రైతు సమస్యలపై నిరసన



దమ్మపేట తహసీల్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు, కార్యకర్తలు

దమ్మపేట: ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితరాలను రైతులకు సబ్సిడీపై అందజేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకులు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దమ్మపేట ప్రధాన సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కార్యాలయ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. అనంతరం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాము మాట్లాడుతూ.. రైతు సాగు చేసిన పంటకు బీమా సౌకర్యం కల్పించి, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు చట్టాన్ని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తోడెం దుర్గమ్మ, పండూరి వీరబాబు, కుంజా కాంతారావు, పాపారావు, సత్యం, ముక్తేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ డీఈకి ఈఈగా అదనపు బాధ్యతలు



హరీష్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈగా హరీష్‌ను ఐటీడీఏ పీఓ రాహుల్ నియమించారు. ఇప్పటికే డీఈగా బాధ్యతలను నిర్వహిస్తున్న హరీష్‌కు ఈఈగా పీఓ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి, ప్రభుత్వం అందచేస్తున్న పథకాలను వారి దరికి చేర్చడంలో తన వంతు విధులను నిర్వహిస్తానని పేర్కొన్నారు. కాగా బాధ్యతలను స్వీకరించిన ఆయనకు వివిధ యూనిట్‌ల అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముగ్గురిపై దాడి కేసు నమోదు

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలో దారి వివాదంలో జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవి శుక్రవారం రాత్రి తెలిపారు. రవి కథనం ప్రకారం.. దారి వివాదంలో గురువారం రాత్రి జమ్మ, దేవి, కృష్ణ, మంగ్యాతలపై దాడి చేసి గాయపరిన లచ్చిరాం, నర్సింహా, అనసూర్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

మణుగూరురూరల్: పినపాక నియోజవకవర్గానికి కేటాయించిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను త్వరగా ప్రారంభించాలని అఖిలపక్ష కుల (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ) సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాసంవత్సరం ఆరంభాన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు.

ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు వేర్పుల నరేష్, వీరంకి వెంకట్రావు గౌడ్, పెనుగొండ సాంబశివరావు, కె.నరసింహారావు, జె.సురేందర్, ప్రసాద్, పి.రమేష్, పాడుతూరి కల్యాణ్, జి.రవికుమార్, జి.కవిత, ఏ.నిర్మల, ఎస్.నాగభూషణం, కంప రవి, పి.వీరబాబు, కె.సత్యనారాయణ, జగన్నాథం, వేర్పుల సురేష్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట' కార్యక్రమం ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలు, సమావేశాలు చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను వివరించారు. అక్కడ చదవడం వల్ల నాణ్యమైన విద్య అంది విద్యార్థుల భవిష్యత్తు ఏ విధంగా ఉంటుందో విశదపరిశారు.

– సాక్షి నెట్‌వర్క్



ములకలపల్లి: కరపత్రాలతో బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ, ఎంఈఓ, ఉపాధ్యాయులు



దుమ్ముగూడెం: నర్సాపురం కాంప్లెక్స్ పరిధిలో బడిబాట ర్యాలీ



భద్రాచలంటౌన్: ప్రతిజ్ఞ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు



మణుగూరురూరల్: ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరిస్తున్న హెచ్‌ఎం సత్యదేవి



దమ్మపేట: దుర్గం గొల్లగూడెంలో బాలికల ఆశ్రమ పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ



అన్నపురెడ్డిపల్లి: బడిబాట కార్యక్రమంలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు



అశ్వారావుపేటరూరల్: బడిబాట గ్రామసభలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాదరావు

పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ



దుమ్ముగూడెం: పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ సమ్మయ్య

చంద్రుగొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ పుస్తకాలను ఎంఈఓ సత్యనారాయణ శుక్రవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. 38 పాఠశాలలకు 11,278 పాఠ్యపుస్తకాలు, 11,500 నోట్‌బుక్కులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఐదో తరగతి తెలుగు, తొమ్మిదో తరగతి హిందీ పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందని ఎంఈఓ తెలిపారు.

దుమ్ముగూడెం: మండలంలోని పాఠశాలలకు మండల విద్యా శాఖ కార్యాలయం నుంచి ఎంఈఓ సున్నం సమ్మయ్య చేతుల మీదుగా పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ముందుగా కార్యాలయంలో మండలంలోని అన్ని ప్రాంతాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బడిబాట కార్యక్రమాలపై చర్చించి, తగు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం హెచ్‌యం ఏవీ రామారావు, పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజే.ప్రభాకర్, ఇతర ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంగళరాయసాగర్‌కు శంకుస్థాపనపై అభ్యంతరం



అలుగు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

చంద్రుగొండ: మండలంలోని సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్‌కు ఇటీవల ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శంకుస్థాపన చేయడాన్ని సీపీఎం అనుబంధ రైతుసంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రశ్నించారు. మండల నాయకులతో కలిసి ఆయన ప్రాజెక్ట్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపించిన తరుణంలో పనులు ఏ విధంగా పూర్తి చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.33.55 కోట్లు నిధులు మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే వర్షాకాలం పనులు ఏ విధంగా చేస్తారని ఆయన అడిగారు. నాయకులు కునుసోత్ ధర్మా, కె.తిరుపతిరావు, మండల నాయకులు పెద్దిని వేణు, సీతారాములు పాల్గొన్నారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం

చంద్రుగొండ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూభారతితో భూ సమస్యలన్నీ పరిష్కారమౌతాయని డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న అన్నారు. మండలంలోని గుర్రాయిగూడెంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ భూములకు చెందిన సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి గుర్రాయిగూడెంలో 49, తుంగారంలో 215 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు.

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని అచ్యుతాపురం, కన్నాయిగూడెం గ్రామ పంచాయతీల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సదస్సుల్లో స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ రెండు పంచాయతీల పరిధిలో 250 మంది రైతులు భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు అందించినట్లు తెలిపారు. సదస్సుల్లో డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్, ఆర్‌ఐలు కృష్ణ, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా నమూనా ఇంటి నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ మోడల్ ఇల్లు

ములకలపల్లి: ఇందిరమ్మ ఇంటి నమూనా గృహం నెలలు గడుస్తున్నా అసంపూర్తిగానే ఉంటోంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టారు. బేస్‌మెంట్ వేసి, గోడలు నిర్మించి, స్లాబ్ పూర్తి చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఆపై పనలన్నీ పడకేశాయి. గోడలకు ఫ్లోరింగ్‌తోపాటు, ఇంట్లో ఫ్లోరింగ్, బాత్రూం, లెట్రిన్ నిర్మాణం, కిటికీలు, దర్వాజలకు తలుపుల ఏర్పాటు తదితర ఫినిషింగ్ పనులన్నీ పెండింగ్ లోనే ఉన్నాయి. మోడల్ కాలనీ పేరిట చాపరాలపల్లితోపాటు, మండల వ్యాప్తంగా 550 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో కొంతమంది లబ్ధిదారులు ముగ్గుపోసి, నిర్మాణాలను ఆరంభించారు. ఈ తరుణంలో నమూనా ఇంటి నిర్మాణం తూతూమంత్రంగా సాగడంపట్ల పలువురు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకం అమలులో సంబంధితశాఖ అధికారుల అలసత్వ విధానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా చొవరచూపాలని కోరుతున్నారు.